స్వల్ప విషయాలు

చిక్కటి చీకటిని తరుముతూ పొగలు కక్కుతూ హడావిడిగ మద్రాస్ మెయిల్ ప్లాట్‌ఫారం చేరుకుంటోంది. అప్పుడే స్టేషన్లోఅడుగుపెట్టిన పోలీస్ ఆఫీసర్ రంగనాథరావు ప్లాట్‌ఫారంమీద నెమ్మదిగా అడుగులువేస్తూ కొంచెం తలెత్తి హోదా ఉట్టిపడేట్టు ట్రెయిన్‌వైపు చూస్తూ రైలు పెట్టెల్ని తనిఖీ చేయసాగాడు. ఆ సమయంలో అతనికి నిస్సందేహంగా కొంచెం స్వాతిశయం కలిగింది. తను స్టేషన్లో అడుగు పెట్టాడో లేదో అలస్యానికి పేరుమోసిన ఆ మెయిల్ అలావచ్చేయటం చూస్తే ఆ బండే తనముందు నమ్రతగా హాజరై గౌరవాభివందనం చేస్తున్నట్టనిపించింది రంగనాథ రావుకి. అయితే అతని కిలాంటి తమాషా ఊహలు అప్పు డప్పుడు కలుగుతూండటం మామూలే కనక, వెంటనే మనసు

లోనే నవ్వి ఆ దృశ్యం చెరిపేసుకుని తనపనిలో నిమగ్నుడయ్యాడు. ఆ రైల్లో తన పైఅధికారి రావాలి. దాటిపోయిన మొదటితరగతి పెట్టెల్లో కనిపించలేదు. మెయిల్ అలిసిపోయి ఆగిపోయింది. వెనక్కి తిరిగి రైలు చివరిదాకా వెళ్ళిచూచాడు రంగనాథరావు. పైఅధికారి తన కెందుకో ఆ రోజు ముఖం తప్పించేశాడు. సరే, ఇక వెతికి లాభంలేదు. కారులో ఇంటికి చేరి హాయిగా నిద్రపోతే కలలో దర్శన మిస్తాడేమో మహానుభావుడు ! రంగనాథరావు తను అనవసరంగా స్టేషన్కి వచ్చినందుకు విసుక్కుని మెయిల్ వైపు కొంచెం కోపంగా పరకాయించి చూచాడు. ఆ కోపదృష్టులకి చలించి భయపడినట్టుగా మద్రాస్ మెయిల్ ఆక్రోశించింది. గంట గణగణ మోగుతోంది రంగనాథరావు చెవుల్లో. అతడు ఒక్కసారి తీక్షణంగా ప్లాట్ఫారం ఆ మూలనించి ఈ మూలదాకా చూశాడు. ఈలవేశాడు గార్డు. పచ్చలాంతరు కాంతి పుంజాలు విరజిమ్ముతోంది. బరువుగా కదిలింది మెయిల్.

ఏమీతోచక జనాన్ని ఉబుసుపోకగా పరికిస్తున్న రంగనాథరావు కళ్లు ఓ యువకుడిమీద నిలిచి ఠకీమని అక్కడే ఆగిపోయాయి. అత డెవరో గాభరాగా అటూ ఇటూ తిరుగుతున్నాడు. ముఖంలో ఆందోళన కనిపిస్తోంది. ఎందుకోసమో చుట్టుపక్కల తచ్చాడుతూ అకస్మాత్తుగా రంగనాథరావుని చూసి ఒక్క క్షణం ఆగి, తేరిపారచూసి వెనక్కి తిరిగి గబగబ నడిచి వెళ్ళసాగాడు. పోలీస్ ఆఫీసర్ రంగనాథరావుకి ఏదో అనుమానం తట్టింది. అత డలా బిత్తర చూపులు చూస్తూ తనని కనిపెట్టి తటాలున తప్పుకోటంలో

అత నేదో నేరంలో ఇరుక్కునట్టు వెల్లడవుతూనే ఉంది. ఈ ఆలోచన కలగగానే రంగనాథరావు ఆ యువకుడికోసం గాలించసాగాడు. ప్లాట్‌ఫారమంతా కలయచూసి వెయిటింగ్ రూమ్‌లోకి వచ్చేసరికి సాక్షాత్తు మూర్తులా ఆ యువకుడి రూపమే ప్రత్యక్షమైంది. అయితే వెనక్కి తిరిగి కూర్చుని రౌండ్ టేబిల్ మీదికి వంగి ఏదో రాసుకుంటున్న భంగిమలో ఉండటంవల్ల, రంగనాథరావు అనుమాన నివృత్తి కోసం మరింత దగ్గరగా అతని వెనకగా వచ్చి చూశాడు. అతడే, సందేహంలేదు. ఆ తలకి చుట్టిన మఫ్లరు, ఇన్‌షర్టు, బ్రౌన్ ట్రౌజరు—అతన్ని పట్టి ఇచ్చాయి. రంగనాథరావు కుతూహలంగా అతని భుజాల మీదుగా వంగి చూడసాగాడు. ఆయువకు డేదో రాస్తున్నాడు. వెనకాల అలికిడి విని అనుమానంగా అతను వెనక్కి తలతిప్పి తేల్లబోయాడు. ఇద్దరి చూపులూ క్షణకాలం కలిసి వేరయాయి. రంగనాథరావు కొంచెం తటపటాయించాడు. ఆ యువకుడి ముఖంలో కోపం, ఆవేశం, అసహ్యం పోటీలు పడుతున్నాయి. ముఖం చిట్లించుకుని, "ఇతర్ల ఉత్తరాలు దొంగచాటుగా చదవటం పెద్దమనిషి తరహా అనిపించుకోదు", అని చీదరింపుగా అన్నాడు. రంగనాథరావు వెంటనే ఏమీ జవాబివ్వలేదు. తాపీగా పక్కనవున్న కుర్చీలో కూర్చున్నాడు. తరవాత జేబులోంచి సిగరెట్ కేస్ తీసి, ఓ సిగరెట్ వెలిగించి పొగ వదుల్తూ ఆ యువకుడివైపు అలాగే చూడసాగాడు. ఆ వైఖరికి అతనికి వొళ్లుమండి చివాలున లేచి వెళ్ళిపోబోయాడు. కాని రంగనాథరావు అధికారస్వరంతో కొంచెం బిగ్గరగా

"ఆగండి, మీతో కొంచెం మాట్లాడాలి," అన్నాడు. ఆ యువకు డేమీ మాట్లాడకుండా నిర్లిప్తంగా కుర్చీలో మళ్ళీ కూర్చున్నాడు.

"మీ పేరేమిటి?"

"ఫలానా", నిర్లక్ష్యంగా జవాబిచ్చా డాయువకుడు.

"సరిగా జవాబులు చెప్పటం మంచిది", రంగనాథ రావు స్వరంలో కొంచెం చిరాకు ధ్వనించింది.

"మీ రనుకున్న దే", అన్నా డతను.

"నే ననుకునే దేమటి? నీ పే రేమిటో నా కెలా తెలుస్తుంది?" అని విసుక్కున్నాడు రంగనాథరావు.

ఆ యువకుడు కొంచెం పొడిగా నవ్వి "పేరు తెలియకుండానే మాట్లాడటాని కెలా వచ్చారు?" అన్నాడు.

రంగనాథరావుకి అరికాలిమంట నెత్తి కెక్కింది. కోపంగా అన్నాడు. "నేరస్థుల పేర్లేమిటో ముందుగా విచారించాలిసిన అవసరం నా కేమీ లేదు."

ఈ మాటలకి ఆ యువకుడు విస్తుపోయి అపనమ్మకంతో రంగనాథరావు వైపు తేరిపార చూచాడు. అతని కళ్ళలో ఏదో సందేహం తొంగిచూస్తోందనే విషయం పోలీసు ఉద్యోగి రంగనాథరావు వెంటనే గమనించాడు. తను తొందరపడ్డా డేమో ననిపించిం దతనికి. సర్దుకుంటున్నట్టుగా "సరే నే నా ఉత్తరం చూడవచ్చా?" అని తగ్గుస్వరంలో అన్నాడు.

"క్షమించండి, అది వ్యక్తిగతమైనది." అనేశా డతను.

రంగనాథరావు కుర్చీకి జేరగిలబడి గట్టిగా పొగపీల్చి వెయిటింగ్ రూమ్ చుట్టూ ఒకసారిచూసి వొదిలేశాడు. సరిగా అదేసమయంలో తలుపుదగ్గర ఇద్దరుముగ్గురు యువకులు తారట్లాడుతూ లోపలికి రావటానికి సందేహిస్తుండటం గమనించి 'ఏం కావా', లన్నట్టుగా వాళ్ళవైపు చూసి తల ఎగరవేశాడు. ఆ సంజ్ఞతో వాళ్ళకి ధైర్యం వొచ్చి సరాసరి లోపలికివచ్చి ఏదో లిస్టుతీసి రంగనాథరావుకి చూపిస్తూ 'తుపానుబాధితుల సహాయార్థం', అని నసిగారు. కోపమూ నవ్వూకూడా కలిసి వొచ్చేసరికి రంగనాథరావు తప్పనిసరిగా చిరునవ్వునవ్వి 'ఈ చందాలకి వేళా పాళా లేదా?' అన్నాడు. 'సంఘసేవ అవన్నీ గుర్తించదండీ', అని, తన సమాధానం హుందాగానే ఉన్నదని గర్వంగా చూశాడు ఆ బృందనాయకుడు. చందాలలిస్టు ఓసారి పైనించి కిందికిచూసి వాపసు ఇచ్చేశాడు ఆఫీసర్. పదులూ, పదిహేన్లూ వేశారు చాలామంది.

"తమరు......" అసంపూర్తిగా ఆగాడు చందాల వసూలుదారు. పెదవి విరిచాడు రంగనాథరావు.

"ఏదో తమకు తోచినది—"

ఆ మాటలకు మధ్యలోనే అడ్డొచ్చి అన్నాడు రంగనాథరావు.

"చాలామంది వేశారుగా చాల్లెండి".

"తమలాంటివారే అలా అనుకుంటే—" ఆశకొద్దీ నమ్రతగా అడుగుతున్నాడతను. కాని చూస్తూచూస్తూ పదో పదిహేనో వొదులుకోబుద్ధి పుట్టలేదు రంగనాథరావుకి.

వెళ్ళిపొమ్మని ఖచ్చితంగా చెప్పేశాడు. ఆఖరి విజ్ఞప్తి చేయ సాగా డతను.

"మీారిచ్చే ప్రతి రాగిదమ్మిడీ ఒక బీదవాడి అతి ప్రాథమిక అవసరాలకు కొంతకుకొంతైనా సహాయపడుతుంది. ప్రతి అణా ఒక బీదవాడి ముఖ్యావసరాలకు..."

"ఎవ రా బీదవాడు ?"

"లక్షోపలక్షలు. ఎందరెందరో దరిద్రనారాయణులు."

"అయితే సరే. అందరికీ మనం ఎక్కడ సహాయం చేస్తాం? అది సంభవమేనా?" అని గడుసుగా నవ్వి, ఇహ వెళ్ళమన్నట్టుగా గడియారంవైపు చూసుకుని, ఒకసారి దగ్గి ముఖం కొంచెం గంభీరంగా పెట్టాడు రంగనాథరావు. అదే క్షణాన అతడు ఊహించని సంఘటన జరిగిపోయి అతనిని ఆశ్చర్యచకితుణ్ణి చేసింది. తను అనుమానించిన యువకుడు చప్పున పర్సు తీసి నోట్లన్నీ బయటికి లాగి చందా ఇచ్చే శాడు. ఈ ఆకస్మికసంఘటనకి స్తంభీభూతులై ఆ చందాల బృందంవారు ఏమనటానికీ నోరురాక ఏదో కృతజ్ఞతాపూర్వ కంగా నసిగి వెళ్ళబోతూ ఏదో జ్ఞాపకం వొచ్చినట్టు ఆగి, ఆ యువకుడి పేరు అడిగారు. నిర్లిప్తంగా అతను, "శేఖరం", అన్నాడు. ఆపేరు రాసుకుని మళ్ళీ ఇంకోసారి కృతజ్ఞత చెప్పేసి రంగనాథరావువైపు కొంచెం చులకనగా చూసి, వెళ్ళిపోయారు చందాలవారు. ముఖం కొట్టేసినట్టయి ఆ ఉద్యోగి శేఖరంవైపు చూడలేక తల దించుకొని, ఇంతలో ఏదో తళుక్కున మనసులో మెరసినట్టయి హేళనగా అన్నాడు.

"సొంత డబ్బేనా ?"

శేఖరం జవాబివ్వదలచుకోక మాట్లాడకుండా ఊరు కున్నాడు. ఆఫీసర్‌కి కొంచెం ఉక్రోషం వొచ్చింది. పౌరుషంగా అన్నాడు.

"ఆ ఉత్తరం నేను చూడాలి."

"చూశారుగా", ఈసడింపుగా అన్నాడు శేఖరం.

"లేదు. చూడాలి".

"కారణం ?"

"మీ ప్రవర్తన అనుమానాస్పదంగా ఉంది. చదువు కున్నట్టుగా కనిపిస్తున్నారు. నాకిబ్బంది కలిగించకండి."

ఆ మాటలభావం గ్రహించి ఉత్తరం అతనిమీద పడేశాడు శేఖరం నిర్లక్ష్యంగా. రంగనాథరావు చదవసాగాడు.

"ప్రియమైన రోజా,

ఈ రాత్రి మద్రాస్ మెయిల్ మనిద్దరికోసమే హుటాహుటిగా వొస్తోందనుకున్నాను. నన్ను అపహాసించి అది వెళ్ళిపోతుంటే కుంగిపోయాను. గుండె పగిలిపోతే బాగుండు ననిపించింది. నువ్వు రాలేదు. కారణం తెలుసు. పరిస్థితులన్నీ మనకు వ్యతిరేకమే. బతికి బావుకునేదేమిటి ? నిన్ను క్షోభ పెట్టడమేగా ! సెలవియ్యి.

సీ

శేఖరం"

చేసేది పోలీస్ ఉద్యోగమే అయినా రంగనాథరావుది జాలిగుండె. ఉత్తరం చదివిన తరవాత అతనికి శేఖరం మీది కోపం పోయి ఆ స్థానంలో జాలి కలిగింది.

"పాపం, ప్రేమోపహతుడు", అనుకున్నాడు. శేఖరం వైపు దయతో నిండిన కళ్ళతో చూశాడు. కాని అతడు తలవంచుకునే వున్నాడు.

"ఏమిటోయ్ ఈపని?" కొంచెం చనువుగా అడిగాడు రంగనాథరావు. శేఖరం జవాబివ్వలేదు.

"ఎవరా అమ్మాయి?" ప్రత్యుత్తరం లేదు శేఖరం దగ్గర్నించి.

"ఇందుకా అంత ఆదుర్దాగా ప్లాట్‌ఫారం మీద కాలు కాలిన పిల్లిలా తిరిగావు! ఎందుకో అనుకున్నాను", తేలిగ్గా నవ్వాడు రంగనాథరావు.

ఆ నవ్వుకి శేఖరం ఓసారి తలెత్తి అతనివైపు చూసి మళ్ళీ పక్కకి తిప్పి ఏదో ఆలోచించసాగాడు. వ్యవహారం తను ఊహించిన విధంగా పరిణమించటంలేదు. "ఆ అమ్మాయి నిన్ను నిజంగా ప్రేమించిందా?" కొంచెం కుతూహలంగా అడిగాడు రంగనాథరావు. ప్రేమవ్యవహారాల్లో సంబంధం కలిగించుకోటం ఆ పోలీస్ ఆఫీసర్‌కి అదే మొదటిసారి. ఈసారి శేఖరం నోరువిప్పాడు.

"మనస్సాక్షిగా."

"సాక్ష్యం?"

"ఆమెకి నేనూ, నా కామె."

"అయితే మరి పెళ్ళెందుకు చేసుకోలేదు?"

"అనేక ఆటంకాలున్నాయి", అన్నాడు శేఖరం నిస్పృహగా.

"ఏమిటవి ?"

"నాకు వేలకివేలు లేవు. పెద్దపెద్ద చదువులు లేవు. గొప్పగొప్ప సంబంధీకులు లేరు. కామధేనువులాంటి ఉద్యోగం లేదు."

"అయితే ఏమున్నాయి?" అప్రయత్నంగా కొంచెం హాస్యధోరణిలో అడిగాడు రంగనాథరావు.

"తినటానికి తిండి ఉంది. బి. ఏ., డిగ్రీ ఉంది. సాహిత్య సంగీతంలో ప్రవేశం ఉంది. అన్నిటినీమించి హృదయం ఉంది'', అన్నాడు శేఖరం ఆత్మగౌరవం ఉట్టిపడేలా.

"మంచిదే. మరి అభ్యంతరం ఏమిటి?" అడిగాడు రంగనాథరావు నిజంగానే అర్థంగాక. శేఖరం కళ్ళెత్తి ఆయన వైపుచూస్తూ విషాదంగా నవ్వాడు.

కాని ఆ అమ్మాయి తండ్రికి కావలసినవి అవికావు. కాబోయే అల్లుడు విదేశాల్లో డిగ్రీలు పొందిరావాలనీ, మంచి సంప్రదాయం అయి ఉండాలనీ, వర్ణాంతరం పనికి రాదనీ ఏవేవో ఊహలున్నాయి ఆయనకి'', అంటూ నిట్టూర్చాడు శేఖరం.

"ఓహో, అలాగా!" అని మళ్లీ సందేహంగా "ఆయన్ని అడిగిచూశావా?" అన్నాడు రంగనాథరావు.

"ఎందుకూ ? లాభంలేదు."

"ఆ అమ్మాయి అడిగింది కాబోలు."

లేదన్నాడు శేఖరం.

రంగనాథరావు బిగ్గరగా నవ్వాడు. భావంగ్రహించి శేఖరం అందుకున్నాడు.

"అవసరం లేదు. ఆయన స్వభావం ఆమెకి పూర్తిగా తెలుసు. ప్రతి చిన్న విషయంలో ఆయన పేచీకోరేనట. సహనం అంటే ఆయనకి అర్థం తెలియదుట. తనమాటే తనదిట. ఏమాత్రం అభ్యుదయ భావాలు లేవని, తను కాలేజీలో చేరేటప్పుడే ఈ విషయాలన్నీ హెచ్చరించాడని ఆమె నాకెన్నోసార్లు చెప్పింది. అందుకే ఆయనకి తెలియకుండా మద్రాసులో వివాహం చేసుకుందామని నిశ్చయించుకున్నాము. కాని నేను దురదృష్టవంతుణ్ణని తేలిపోయింది."

"అందువల్ల ఆత్మహత్య చేసుకుందామనుకున్నావా?" అన్నాడు రంగనాథరావు కొంచెం మందలింపుగా.

"ఏం చెయ్యను?" అన్నాడు శేఖరం నిస్సహాయంగా.

"అందుకేనా అంత ఉదారంగా కరెన్సీ నోట్లన్నీ పంచి పెట్టేశావు?" రంగనాథరావుస్వరంలో ఒక విధమైన ధ్వని గమనించిన శేఖరం ఏమీ బదులు చెప్పలేక ఊరుకున్నాడు.

"ఆత్మహత్య నేరమని తెలుసా?"

"కావచ్చు."

"ఇప్పుడు నిన్ను ఆత్మహత్యాప్రయత్న నేరంకింద అరెస్టుచేస్తే ఏంచేస్తావు?"

"మీ ఇష్టం", అన్నాడు శేఖరం నిర్లక్ష్యంగా.

"ఈ ప్రయత్నం విరమించుకుంటానని హామీ ఇస్తే, నీ దారిని నువ్వూ, నా దారిన నేనూ పోవటానికి నాకు అభ్యంతరం లేదు. కాని నీ హామీపట్ల నువ్వు నిజాయితీగా ఉండాలి." అని అతనివైపు ఆశగా చూశాడు పోలీసు ఆఫీసర్.

"క్షమించండి. నాకు జీవితంమీద ఆశలేదు."

"కాని ఆత్మహత్య నేరం, అన్యాయం, పిరికితనం, ఆలోచించు." శేఖరం జవాబివ్వలేదు.

"ఏం?" అన్నాడు రంగనాథరావు ఒప్పుకోమన్నట్టు.

"క్షమించండి", అన్నాడు శేఖరం.

"అయితే నిన్ను అరెస్టు చేయకతప్పదు."

"మీ ఇష్టం".

"ఆల్ రైట్, పద", విసుగ్గా అన్నాడు పోలీస్ ఆఫీసరు.

తీవ్రమైన ఆ కంఠం విని కొంచెం చలించాడు శేఖరం. అంతకోపంలో ఆయన్ని చూడటం అతని కదే ప్రథమం. బరువుగా అడుగులు వేసుకుంటూ నడవసాగాడు. ఇద్దరూ స్టేషన్ ఆవరణ దాటి బయటికి వచ్చారు. వెన్నెల మసక మసగ్గా మబ్బుల్లోంచి జారి పడుతోంది. వెన్నెల్లో రంగనాథరావు 'టూసీటర్' నల్లగా మెరుస్తోంది. డ్రైవరు కనిపించక చుట్టుప్రక్కల చూశాడు రంగనాథరావు. దూరంలో బీడీ కాల్చుకుంటూ అతడు ఎవరితోనో మాట్లాడుతున్నాడు. యజమాని కేక విని అతడు అదరిపడి

ఒక్క పరుగులో అక్కడికి చేరుకున్నాడు. రెండు తప్పులు చేశాడు తను. కారుదగ్గర హాజరు కాలేకపోవటం, బీడీ కాల్చుకుంటూ ఆఫీసరుగారి కంట పడటం. కోపంగా అరిచాడు రంగనాథరావు.

"ఎన్నిసార్లు చెప్పాను నీకు ఆ వెధవ పని చెయ్యొద్దని. కారుదగ్గర రెడీగా ఉండవు. నా ఎదుట బీడీకాల్చటం మానవు."

"సార్", అన్నాడు డ్రైవర్ బతిమాలుకుంటున్నట్టు.

"ఇప్పటికి వందసార్లు ఉద్యోగంపీకేశాను. ఏంలాభం?" గొణుక్కున్నాడు ఆఫీసర్.

అంటే మళ్లీ వందసార్లు ఉద్యోగం ఇచ్చాడన్నమాట అని నవ్వుకున్నాడు శేఖరం.

"సార్", అన్నాడు డ్రైవరు క్షమించమన్నట్టు.

ఇద్దరూ కార్లో కూర్చున్నారు. కారు కదలబోయే సమయానికి ఓ యువకుడువచ్చి 'నమస్కారమండీ', అన్నాడు.

"ఓ నువ్వటోయ్, మూర్తీ, ఏం ఇలావచ్చావు? రా, కూర్చో, ఇంటికేనా?" అని రంగనాథరావు అతన్ని నవ్వుతూ పలకరించాడు. అతను కార్లో కూర్చోగానే కారు బయల్దేరింది.

"ఏమిటోయ్, విశేషాలు మూర్తీ?"

"ఆఫీసర్ గారు రేపు మధ్యాహ్నం వస్తామన్నారండీ", అన్నాడు మూర్తి.

"ఆఫీసర్‌గా రేవరు?" అని కనుబొమ్మలు చిట్లించి అడిగాడు రంగనాథరావు.

"డి. ఎస్. పి. గారండీ."

"ఓహో నీ కెలా తెలిసింది ?"

"నేను వారి కాంప్ క్లర్కుని గదండి !"

"కాంప్‌క్లర్కు ! ఎప్పట్నించీ ?"

"సుమారు ఓ నెల రోజుల్నుంచీ."

"బి. ఏ. ఆనర్సు., ఇంకా సంవత్సరం చదవాలికదూ నువ్వు ?"

"అవునుకాని మానేశానండీ."

"మానేశావా ? ఎందుకూ ?"

మూర్తి ఓ నిట్టూర్పు విడిచాడు.

"మా కుటుంబ వ్యవహారాలు మీకు తెలియనివిగావు గదండీ. అసలే బీద సంసారం. అందులో పెద్ద సంసారం. అందరికీ నేనే దిక్కు. అదొకటి తక్కువైనట్టు ఈస్థితిలోనే నేను మా మేనమామ కూతుర్ని పెళ్ళి చేసుకోవలసి రావడం—ఇన్ని బాధ్యతలు నెత్తిమీద పెట్టుకొని సంసారాన్ని ఈదుకురావాలంటే చదువుకికూడ యింక డబ్బెక్కడనించి వొస్తుంది ?"

"అదేమిటి, ఎక్కడా ప్రయత్నం చెయ్యలేదా ?" అన్నాడు రంగనాథరావు.

"చెయ్యకేం. అన్ని ప్రయత్నాలూ అయాయి. అవి విఫలమయ్యాయి."

"మరి ఇంతవరకు ఖర్చు పెట్టిందంతా వ్యర్థంకదూ ?"

"అదంతా జ్ఞాపకంచెయ్యకండి. తలుచుకున్నప్పుడల్లా గుండెల్లో బాధగా వుంటుంది."

"ఈ సంవత్సరం పూర్తిచెయ్యకపోతే, ఇహ తర్వాత వీల్లేదు కదూ ? శ్రమంతా బూడిదలో పోసిన పన్నీరే!"

"అది నా దురదృష్టం. గుమాస్తాగిరీ రాసిపెట్టి ఉంటే పై చదువు లెలా అబ్బుతాయి."

"అడగవలసిన వాళ్ళందర్నీ అడిగావా ?"

"ఒక్కసారికాదు."

"నన్ను అడిగినట్టు జ్ఞాపకంలేదే."

మూర్తి చకితుడై రంగనాథరావువైపు చూశాడు. "మిమ్మల్నా ? మిమ్మల్ని...అడుగుదామనే అనుకున్నాను కాని...సాహసించలేదు."

"ఎందుకూ ?" యథాలాపంగా అడిగినట్టు అడిగాడు రంగనాథరావు.

మూర్తి జవాబివ్వలేదు.

"ఇవ్వననుకొని ఉంటావు-ఏం ?"

ఏం సమాధానం చెప్పాలో మూర్తికి తెలియలేదు. "పోనీ, ఇస్తే తీసుకుంటావా ?"

"ఎంతమాట !" అన్నాడు మూర్తి ఉక్కిరి బిక్కిరై. "ఓ వెయ్యి రూపాయలు సరిపోతుందనుకొంటాను. నీ యిష్టంవచ్చినప్పుడు తీర్చుకోవచ్చులే." ఈ ఔదార్యం మూర్తిని సంతోషాశ్చర్యసాగరాలలో ముంచివేసింది.

కలలోకూడ అలా జరుగుతుందని తను అనుకోలేదు. రంగనాథరావుగారు తనకి వెయ్యిరూపాయలు అప్పివ్వటం సంభవమౌతోంది. తను మొదటే ఆయన దగ్గరికి ఎందుకు వెళ్ళలేకపోయాడు! కృతజ్ఞతాపూర్వకంగా అన్నాడు :

"మీ మేలు జన్మలో మర్చిపోలేను. పోయిందనుకున్న ఆనర్సడిగ్రీ మీరు ప్రదానం చేస్తున్నారు. రెండేళ్లు భుక్తి కోసం మీ పిల్లలకి చదువు చెప్పినంతమాత్రాన మీరు చూపించే ప్రేమవాత్సల్యాలు నాజీవితంలో ఎప్పుడూ మర్చిపోలేను..."

అతని వాక్ప్రవాహానికి మధ్యలోనే అడ్డొచ్చి "పరవాలేదులేవోయ్, దీనికింత బ్రహ్మాండంగా బ్రహ్మారథం పడతావేమిటి, ఇహచాల్లే", అంటూ సీటుకి జేరగిలబడ్డాడు రంగనాథరావు. శేఖరానికిమాత్రం ఇదంతా కలలా కనిపించింది. ఒక్క పదిరూపాయలు చందాఇవ్వటానికి వెనకాడి వెయ్యిరూపాయలు సునాయాసంగా ఇంచుమించు ఊరికే ఎవరికో ఇచ్చివెయ్యటం అతనికి అర్థంకాలేదు.

అత నా ఆలోచనలో ఉండగానే మూర్తి దిగిపోయి సెలవుపుచ్చుకోటం జరిగింది.

"ఏమోయ్, మనసు మార్చుకున్నావా?" అన్నాడు రంగనాథరావు.

"క్షమించండి", అన్నాడు శేఖరం.

"డ్రైవర్, పోలీసుస్టేషన్కి పోనియ్యి", అని ఆజ్ఞాపించి ఆవులించాడు పోలీస్ఆఫీసర్. కొద్దిక్షణాలాగి, "రాయన

భాస్కరుడి తరువాత మీరేలా ఉండే", అని వ్యంగ్యంగా అన్నాడు శేఖరం.

రంగనాథరావు ఇంకోసారి ఆవులించి, జేబులోంచి సిగరెట్ కేస్ తీసి తెరిచి అందులో సిగరెట్లు కనిపించక పోయే సరికి కోపంగా తపీమని మూసేసి "ఎన్ని చెప్పినా ఇంతే," అని గొణుక్కుని శేఖరంవైపు తిరిగి "సిగరెట్ ఉందోయ్?" అని అడిగాడు. వెంటనే శేఖరం సిగరెట్ పాకెట్ తీసి ఇచ్చాడు. "థాంక్స్", అని సిగరెట్ తీసుకుని ముట్టించి పొగ గుప్పున వొదిలి శేఖరంతో "నువ్వుకూడా కానీ", అన్నాడు రంగనాథరావు. శేఖరం కొంచెం సిగ్గుగా "తమలాంటి పెద్దల దగ్గర ఆపని చెయ్యనులెండి", అనటంతో రంగనాథరావు కొంచెం విస్మయంగా అతనివైపు చూశాడు.

"మా డ్రైవర్‌కి ఎన్నిసార్లు చెప్పినా బుద్ధిలేదు. తార తమ్యాలు పాటించక్కర్లేదూ, ఏమంటావ్?" అని చనువుగా అంటూ శేఖరం భుజంమీద చెయ్యేశాడు.

"అవునవును", అన్నాడు శేఖరం.

"ఉద్యోగం ఎన్నిసార్లు పీకేశానో! మళ్ళీ ఉద్యోగం దొరక్క బాధపడతాడని జాలిపుట్టి వేసుకుంటూనే ఉన్నా ననుకో. నాకు చప్పున కోపంవస్తుంది. కాని త్వరలోనే తగ్గు తుంది. ఆలోపం నాదేనంటావా? లేక నాకు కోపంతెప్పించే వాళ్ళదంటావా?"

"ఊఁ", అన్నాడు శేఖరం జవాబు అనవసరం అన్నట్టు.

"నేను బయటికి వెళ్ళేటప్పుడు నాసిగరెట్ కేస్ నిండా సిగరెట్లు పెట్టమని మా ఆవిడకి ఎన్నిసార్లు చెప్పానో! ఎప్పుడూ కొత్తే. ఇప్పుడు నువ్వే చూశావుగా. ఇదీ వరస. నాకు చర్రున మండుకొస్తుంది. వెంటనే ఏదో అనేస్తాను. నాకు ఓర్పులేదంటావు. నేనంటే లక్ష్యుండుండి, గౌరవం ఉంటే అటువంటి పొరపాట్లు ఆమె చెయ్యకుండానే ఉంటుంది. నేను కోప్పడకుండానే వుంటాను. నేననేవాడిని వున్నానని నేను జ్ఞాపకం చేసుకోటం తప్పంటావా ?"

స్నేహితుడితో చెప్పుకుంటున్నట్టుగా ఆయన అలా అంటుంటే శేఖరం విస్మితుడౌతూ వింటున్నాడు.

"నేనుమాత్రం కిరాతకుణ్ణా? ఓసారేమైందో తెలుసా? ముఖ్యమైన ఆఫీసుకాగితం మా ఆవిడ పర్రున చింపేసి నెయ్యి కరగపెట్టింది. కాలిన ముక్కలు చూసిన తరువాత తెలుసుకున్నాను. ఆవిడ తెలియక చేసిందనుకో. కాని నేను ఆ సంవత్సరం రివర్టయాను. ఐనా మా ఆవిడని పల్లెత్తుమాట అనలేదనుకో. అసలా సంగతే ఆవిడకి తెలియదు. నాకు ఓర్పు లేదంటావా నువ్వుకూడా? చడామడా తిట్టేసి ఉందును. కాని ఆమె ఎవరు—నా భార్యకదూ!" అంటూ రంగనాథరావు ఆకస్మికంగా ఏవో ఆలోచనల్లో పడిపోయాడు. కారు రంయిమని పరుగెడుతోంది.

"పోలీస్ స్టేషన్ సార్", అని కేకేశాడు డ్రైవరు.

రంగనాథరావు ఉలిక్కిపడి శేఖరంవైపు జాలిగా చూచి "ఏమోయ్", అని కొంచెం ప్రాధేయపూర్వకంగా అన్నాడు.

"నేను మనసు మార్చుకున్నానండీ" అన్నాడు శేఖరం చిరునవ్వుతో.

"గుడ్, వెరీగుడ్", అంటూ ఉత్సాహంగా రంగనాథరావు అతని బుజంతట్టి జేబులోంచి ఉత్తరంతీసి ప్రదర్శించివేశాడు. "చెపితే నీకు సహాయంచేస్తాను. ఆ అమ్మాయి తండ్రి ఎవరు?" "పోలీస్ఆఫీసర్ రంగనాథరావుగారు", ఆయన కళ్ళలోకి సూటిగా చూస్తూ చెప్పాడు శేఖరం.

ఉలిక్కిపడి శేఖరంవైపు అయోమయంగా చూశాడు రంగనాథరావు. కొద్ది క్షణాలు నిశ్శబ్దంగా గడిచిపోయాయి.

"ఇందుకా, నేను రైల్వేస్టేషన్‌కి వెడుతున్నానంటే సరోజ అలా తెల్లబోయింది."

రంగనాథరావు ముఖం కందగడ్డలా ఎరుపెక్కింది. కాని ఆయనతో ఆమాత్రం పరిచయం కలిగిన తరవాత పరిస్థితి ఎలా అదుపులోకి తెచ్చుకోవాలో తెలియనంత తెలివి తక్కువవాడు కాడు శేఖరం.